క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన ఈఈ



ఎమ్మెల్యే మత్స్యలింగంనకు పనుల జాబితా అందజేస్తున్న ఈఈ త్రిమూర్తులు

అరకులోయటౌన్: అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంకు లిఫ్ట్ ఇరిగేషన్ ఈఈ వి.త్రిమూర్తులు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న, జరగనున్న పనుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేసి ఖరీఫ్ సీజన్‌లో గిరిరైతుల పంట భూములకు సాగునీరందించేందుకు కృషి చేయాలన్నారు. నీటి వసతులున్న చోట లిఫ్ట్ ఇరిగేషన్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ఎమ్మెల్యేకు ప్రస్తుతం జరుగుతున్న, పనుల జాబితాను అందజేశారు.

పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో కె.బాపన్నదొర అధ్యక్షతన పంచాయతీల పురోగతి సూచికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం విధి విధానాలపై మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయాల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



చంపాపుట్టులో మహిళలతో మాట్లాడుతున్న సీడీపీవో విమలకుమారి

ముంచంగిపుట్టు: గర్భిణిలు,బాలింతలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సీడీపీవో యు.విమలకుమారి అన్నారు. మండలంలో గల అత్యంత మారుమూల రంగబయలు పంచాయతీ చంపాపుట్టు, లంగాబపోదోర్, వనుగుమ్మ పంచాయతీ కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో విమలకుమారి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు తెలిసుకున్నారు. గర్భిణులు,బాలింతలతో మాట్లాడి అందుతున్న పౌష్టికాహారంపై అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధి పొందేందుకు ఈకెవైసీ, ఎఫ్ఆర్ఎస్‌లను చేసుకోవాలని, లేని పక్షంలో అందించే సరకులు నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు టిహెచ్ఆర్, బియ్యం, పప్పులను సీడీపీవో అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్.రాజేశ్వరి, సీహెచ్.స్వర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీవో సాల్మన్‌రాజు

రంపచోడవరం: ప్రభుత్వ పథకాలు పొందేందుకు అన్ని రకాల ధ్రువపత్రాలు కలిగి ఉండాలని దేవీపట్నం ఎంపీడీవో ఎస్ సాల్మన్‌రాజు అన్నారు. కొండమొదలు పునరావాస కాలనీలో శుక్రవారం ప్రకృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అజీమ్ ప్రేమ్‌జీ సహకారంతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాలు పొందేందుకు అవసరమైన ధ్రువపత్రాల గురించి వివరించారు. ఐటీడీఏ, పీఎంయూ ఇన్‌చార్జి పి.చంద్రకళ మాట్లాడుతూ ఆధార్ కార్డులు ఎలా పొందాలి, ఎన్‌పీసీఐఎల్ లింక్ చేసుకోవడం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ప్రకృతి సంస్థ డైరెక్టర్ జి.సుబ్బారాజు మాట్లాడుతూ ఆధార్ కార్డుల పోజిషన్ తెలుసుకోవాలన్నారు. ఆధార్ కార్డుల పరిస్థితి తెలుసుకొనేందుకు తమ సంస్థ కార్యకర్తలు అందుబాటులో ఉంటారన్నారు. దేవీపట్నం సర్పంచ్ కె.రాజామణి, పంచాయతీ కార్యదర్శి, నాయకుడు రామన్నదొర, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు వెంకన్నకు ప్రత్యేక పూజలు

రంపచోడవరం: రంపచోడవరంలో ద్వారకా తిరుమల దత్తత దేవాలయం నారాయణగిరి వెంకటేశ్వరస్వామి, అమ్మవార్లకు శనివారం శాకాంబరి అలంకరణ జరుగుతుందని ఆలయ అర్చకులు వెంకటేశ్వరరావు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొవాలని కోరారు.

కేంద్రాలు ఇలా.. నిర్వహణ ఎలా?



శిథిలావస్థలో ఉన్న నందిమెట్ట అంగన్‌వాడీ కేంద్రం



అద్దె గృహంలో నిర్వహిస్తున్న పెద్దపుట్టు అంగన్‌వాడీ కేంద్రం

- శిథిలావస్థలో అంగన్‌వాడీ సెంటర్లు
- బీటలు వారిన గోడలు, పెచ్చులూడుతున్న శ్లాబులు
- భయం భయంగా సిబ్బంది విధులు
- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, బాలింతలు, గర్భిణులు
- పట్టించుకోని అధికారులు

ముంచంగిపుట్టు: గర్భిణులకు, బాలింతలు, ఐదేళ్ల లోపు చిన్నారులకు పౌష్టికాహారం అందించి మాతా శిశు మరణాలను నివారించేందుకు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కానీ నేడే అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థకు చేరుకొని ఎప్పుడూ కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు భవనాల దుస్థితి మరింత దారుణంగా ఉంది.కారిపోతున్నాయి. కొన్ని భవనాల పూర్తిగా శిథిలావస్థలో ఉండడంతో అంగన్‌వాడీలు అద్దె భవనాలకు మార్చేశారు.భవనాల సమస్యలతో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల అవస్థలు పడుతున్నారు.ముంచంగిపుట్టు మండలం 23 పంచాయతీలో 237అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. మెయిన్-107 కేంద్రాలు, మిని-130కేంద్రాలు ఉన్నాయి. 51 కేంద్రాలకు సొంత భవనాలు, 3 కేంద్రాలు పంచాయతీ కేంద్రాల భవనాల్లో కొనసాగుతున్నాయి.183 భవనాలు అద్దె గృహాల్లో నిర్వహణ జరుగుతుంది. నూతన భవనాలు మంజూరై అసంపూర్తిగా 20 భవనాలు ఉన్నాయి.



సెల్లుం అంగన్‌వాడీ సెంటర్ దుస్థితి



బీట గ్రామంలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

ఇరుకైన గదులతోసతమతం

మండలంలోని మారుమూల రంగబయలు, బుంగాపుట్టు, లక్ష్మీపురం, వనుగుమ్మ, బూసిపుట్టు, బాబుశాల పంచాయతీల్లో అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. గోడలు బీటలు వారి, తలుపులు కిటికీలు పాడై దర్శనం ఇస్తున్నాయి. స్థానికంగా ఎటువంటి అద్దె గృహాలు లేకపోవడంతో సొంత ఇంటి వద్దనే ఇరుక్కు గదుల్లోనే కేంద్రాలు నిర్వహణ జరుగుతూ వస్తుంది. భవనాలు నిర్మించి 40 ఏళ్లు పైగా అవుతుండడంతో భవనాల పైకప్పులు పాడైపోయాయి.పెచ్చులు ఉండి పడుతున్నాయి.వర్షం పడేటప్పుడూ పలుచోట్ల నీరు కారుతుండడంతో విధులకు సైతం ఆటంకం కలుగుతుంది. తీవ్ర ఇబ్బందుల మధ్య అంగన్వాడీలు కేంద్రాలను నెట్టుకొని వస్తున్నారు.దీనికితోడు అధిక శాతం కేంద్రాలకు భవనాలు లేవు. ఇంటి వద్దనో, అద్దెల గృహాల్లో నిర్వహణ జరుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు భవన సమస్య అనేకమార్లు ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా నేటికి పరిష్కారం కాలేదని పలువురు చెబుతున్నారు. ప్రతి రోజు కేంద్రాలకు వచ్చే గర్భిణిలు, బాలింతలు, చిన్నారులు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దీనికి తోడు కేంద్రాలకు సంబంధించిన సరుకులు, రికార్డులను భద్రపరిచేందుకు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. నూతన భవనాలు నిర్మించాలని గర్భిణులు,బాలింతలు కోరుతున్నారు.



పెద్దపుట్టులో శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

నూతన భవనాలు నిర్మించాలి



అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మించి, ఎన్నో సంవత్సరాలు గడుస్తున్నాయి.అనేక కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.అధికంగా అద్దె గృహాలలోనే నిర్వహిస్తున్నారు. గతంలో మంజూరైన భవనాలు నేటికి పూర్తి కాలేదు. వాటిని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలి. ప్రభుత్వం ,అధికారులు స్పందించి, ప్రతి కేంద్రంకు నూతన భవనాలు నిర్మించి, పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలి.

– కె.శంకర్‌రావు, సీఐటీయూ మండల కార్యదర్శి....ముంచంగిపుట్టు మండలం

ప్రతిపాదనలు పంపాం



ముంచంగిపుట్టు మండలంలో 237 అంగన్వాడి కేంద్రాలున్నాయి. వీటిలో కొన్ని శిథిలావస్థకు చేరాయి. అటువంటి వాటిని అద్దె గృహాలకు మార్చడం జరిగింది. గర్భిణిలు, బాలింతలు, చిన్నారులకు కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహణ చేయడం జరుగుతుంది. నూతన భవనాలు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాం. భవనాలకు నిధులు మంజూరైతే నిర్మాణాలు ప్రారంభిస్తాం.

– విమలకుమారి, సీడీపీవో, ముంచంగిపుట్టు

తాగునీటి సమస్య పరిష్కారం

జి.మాడుగుల: మండలంలో పాలమామిడి పంచాయతీ వనభంగిపాడు గ్రామంలో జెడ్పీ నిధులు, లక్కుళ్ల గ్రామంలో మండల పరిషత్ నిధులతో శుక్రవారం రెండు బోరుబావుల పనులను సర్పంచ్ సురభంగి రామకృష్ణ, ఎంపీటీసీ అప్పారావు ప్రారంభించారు. సర్పంచ్ రామకృష్ణ మాట్లాడుతూ వనభంగిపాడు గ్రామంలో గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లడంతో జెడ్పీ నిధులు మంజూరైనట్టు ఆయన తెలిపారు. దీంతో గ్రామంలో నీటి సమస్య పరిష్కారమైందన్నారు.లక్కుళ్ల గ్రామంలో ఎంపీటీసీ చొరవతో నిధులు మంజూరు కావడంతో పనులు చేపడుతున్నట్టు తెలిపారు. వార్డు సభ్యులు కాసులమ్మ, రామారావు, సత్తిబాబు, సింహాచలం, రామస్వామి, కృష్ణంరాజు, రాజారావు, రాజేష్, ప్రసాద్, చిన్నాబ్బాయి, సీమోన్‌కుమార్. ఇస్సాక్, ప్రేమ్‌కుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.



బోరుబావి పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రామకృష్ణ, ఎంపీటీసీ అప్పారావు

వైభవంగా ఊంజల్ సేవ

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన దేవస్థానంలో శుక్రవారం గౌరీపరమేశ్వరుల 206వ ఊంజల్ సేవ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని గౌరీపరమేశ్వరి అమృతవర్షిణి భక్తి బృందం ప్రతినిధి మద్దాల నాగశివ ఉమామహేశ్వరి దంపతులతో ఆలయ ప్రధాన అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ, పాందూరు సూర్యనారాయణ శాస్త్రి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసి నాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, సభ్యులు ఆళ్ల మహాలక్ష్మినాయుడు, మళ్ల సురేష్, ఆళ్ల వెంకట సత్యప్రసాద్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం



ఎర్రబొమ్మలులో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసి బాలయ్య పడాల్, నాయకులు

చింతపల్లి: ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయకుండా మోసం చేయడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన కొనసాగుతుందని చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యపడాల్ అన్నారు. మండలంలో ఎర్రబొమ్మలు పంచాయతీలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షుడు పాంగి గణబాబు అధ్యక్షతన శుక్రవారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యపడాల్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలోనే ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్క పింఛరః మినహా ఏ హామీ నెరవేర్చక పోవడంతో ప్రతి ఒక్కరూ అసంపూర్తితో ఉన్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ఇచ్చిన మాట ప్రకారం హామీలన్నీ నెరవేర్చడంతో పాటు మరిన్ని అదనపు పథకాలను సైతం అమలు చేశారని గుర్తు చేశారు. మండలంలో ఉచిత గ్యాస్ ఊసేలేదని, అమ్మకి వందనం సొమ్ము ఇంకా అనేక మంది తల్లులు ఖాతాలో జమ కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాన్నింటికీ తూట్లు పొడిచిందన్నారు.ఎర్రబొమ్మలు సర్పంచ్ లోతా పండయ్య, ఉప సర్పంచ్ సోమరాజు, నాయకులు గంగన్నాపడాల్, బాలరాజు, సుబ్బారావు, పరమేశ్వరరావు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే సమాజంలో గుర్తింపు



ఈదులగొందిలో శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న డిప్యూటీ డీఈవో చెల్లయ్య



తహసీల్దారును సన్మానిస్తున్న ఎంపీపీ, నేతలు



కొత్తపాలెంలో బదిలీపై వెళ్తున్న సచివాలయ ఉద్యోగులతో సర్పంచ్ సోమరత్నం, వైస్ ఎంపీపీ శారద



కర్రిముఖిపుట్టు సచివాలయ ఉద్యోగులను సన్మానిస్తున్న సర్పంచ్‌లు, నాయకులు

చింతపల్లి: ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అందించిన సేవతోనే మంచి గుర్తింపు పొందుతారని కొత్తపాలెం సర్పంచ్ వనగల సోమరత్నం అన్నారు. మండలంలోని కొత్తపాలెం సచివాలయం-1,2 లలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను సర్పంచ్ సోమరత్నం, వైస్ ఎంపీపీ గోపీనాయక్ శారదలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయా సిబ్బంది అందించిన సేవలను కొనియాడారు. ఎంపీటీసి-2 సభ్యురాలు రాజులమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు వనగల బెన్నిబాబు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని కర్రిముఖిపుట్టు గ్రామ సచివాలయంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న సచివాలయ ఉద్యోగులకు శుక్రవారం స్థానికులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచులు పూల్‌మొత్తి, భాగ్యవతి, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు అరుణ్, సురేష్, రాంప్రసాద్, ప్రసాద్, ఆనంద్, గణేష్, చిరంజీవి, వసంతరావు, జోగారావు, పరుశురాం, జిన్ను, వివిధ పార్టీల నేతలు, స్థానికులు ఆయా సిబ్బందికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. పంచాయతీ ప్రజలకు వారు చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈవోపీఆర్‌డీ చిన్నాన్న, కార్యదర్శి మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని శోభకోట పంచాయతీ ఈదులగొంది గ్రామం మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను శుక్రవారం గ్రామస్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ డీఈవో సోమెలి చెల్లయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు అంకిత భావంతో పని చేసిన ప్రతీ ఉపాధ్యాయుడికి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. గ్రామంలో పాఠశాల లేనప్పటికీ ఉపాధ్యాయులు శ్రీనువాస్ సొంత నిధులు కేటాయించి పాఠశాల నిర్మించి అనేకమంది ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

గ్రామస్తులు మాట్లాడుతు తమ గ్రామంలో పేదరికాన్ని, సమస్యలను గుర్తించి సొంత నిధులతో పాఠశాల నిర్మించి మా పిల్లలకు టీచర్ శ్రీనివాస్ మంచి విద్యను అందించారని సంతోషం వ్యక్తం చేశారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు సత్యారావు, జిల్లా కార్యదర్శి చిన్నారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు మత్యరాజు, ప్రభాకర్, ఉపాధ్యాయులు తదతరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన అన్నాజీరావును ఎంపీపీ బోయిన కుమారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు శుక్రవారం సన్మానించారు. రెవెన్యూ శాఖ ద్వారా గిరిజన ప్రాంత సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుందేరి రామకృష్ణ, వైస్ ఎంపీపీల ఆనంద్, దేముడు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



బందవీధిలో శానిటేషన్ పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో డేవిడ్‌రాజ్, సిబ్బంది



చవిటిదిబ్బలులో సిబ్బందికి సలహాలు సూచనలు ఇస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

జి.మాడుగుల: మండలంలో గల ప్రజలు ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మురుగునీరు నిల్వ లేకుండా చూసుకొని దోమల నివారణకు కృషి చేయాలని ఎంపీడీవో డేవిడ్‌రాజ్ తెలిపారు. మండలంలో కె.కోడాపల్లి పంచాయతీ బందవీధి గ్రామంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్పంచ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, సచివాలయ సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. వాతావరణ మార్పుల వలన, దోమలు వలన మలేరియా జ్వరాలు,వ్యాధులు వంటివి సంభవిస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. డ్రైడే కార్యక్రమంపై ఆయన అవగాహన కల్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: గ్రామాల్లో తప్పనిసరిగా డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలను నిర్వహించాలని ఎంపీడీవో కె.బాపన్నదొర పిలుపునిచ్చారు. మండలంలోని చవిటిదిబ్బలు సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని ఎంపీడీవో పరిశీలించారు. ప్రతీ శుక్రవారం గ్రామాన్ని పరిశుభ్రం చేసే విధానంపై సిబ్బందికి సలహాలు సూచనలిచ్చారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు, ఇతరత్రా నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి. సచివాలయ సిబ్బంది, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

అనంతగిరి(అరకులోయటౌన్): అనంతగిరి మండలం రొంపెల్లి పంచాయతీ కొండ శిఖర గ్రామాలైన బూరిగ, చిన్నకోనిల గ్రామంలో 70 కుటుంబాలు నివసిస్తున్నారు. వీరంతా రేషన్ సరుకుల కోసం 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న రొంపెల్లి పంచాయతీ కేంద్రంలో ఉన్న రేషన్ డిపోకు వెళ్లి రేషన్ తెచ్చుకునేవారు. రహదారి సౌకర్యం ఉన్నప్పటికి పంచాయతీ కేంద్రమైన రొంపెల్లి రేషన్ డిపోకు వెళ్లి రేషన్ తెచ్చుకుంటున్నామని చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్టీ కమీషన్ విజయవాడలోని సివిల్ సప్‌లై కమిషన్‌తో మాట్లాడారు. దీంతో అధికారులను బూరుగ, చిన్న కోనిల గ్రామానికి పంపించి పరిస్థితిని లబ్ధిదారుల నుంచి తెలుసుకున్నారు. రేషన్ బియ్యం గ్రామంలోనే పంపిణీకి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జూలై నెల రేషన్ సరకులు స్వగ్రామానికి తీసుకువెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

దీంతో ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకర్‌రావుకు, సివిల్ సప్‌లై అధికారులకు గ్రామ గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు.



బూరిగ గ్రామంలో లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

చింతపల్లి: చింతపల్లిలో ముత్యాలమ్మవారికి ప్రసాదాలను సమర్పించారు. ముత్యాలమ్మ అమ్మవారిని శాకాంబరీతల్లిగా అలంకరించి తెల్లవారు నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొమ్మంగి, బైలుకించంగి, జెర్రల తదితర గ్రామాలకు సంబంధించిన భక్తులు స్థానిక హనుమాన్ జంక్షన్ నుంచి సంత మార్కెట్ వరకూ అమ్మవారి నామస్మరణతో గీతాలాపన చేస్తూ ర్యాలీ చేపట్టారు.అనంతరం భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రసాదాలు సమర్పించి భజనలు ,కోలాటాలు చేశారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నారాయణదాసు, వీరాస్వామి, వెంకటరమణ, విజయకుమార్, గంగాధర్, జగన్ పంతులు తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపులో భక్తులు